క్లుప్తంగా

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి



మలకపల్లిలో కంద పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త సరళ తదితరులు

తాళ్లపూడి: సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని రైతులు ఉత్తమ ఫలితాలు సాధించాలని శాస్త్రవేత్త డాక్టర్ కె.సరళ తెలిపారు. మండలంలోని మలకపల్లిలో గురువారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ రైతులకు కలవచర్ల కృషి విజ్ఞాన్‌కేంద్రం, ఐసీఏఆర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అనంతరం అరటి, కంద పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త సరళ మాట్లాడుతూ రైతులు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకోవాలన్నారు. భూసార పరీక్షల ద్వారా ఫలితాలు తెసుకుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.రుచిత, కె.రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి



సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు: పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పట్టణంలోని 27వ వార్డులో మున్సిపల్ సాధారణ నిధులు రూ.11.80 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, 4వ వార్డు కుమ్మరి వీధిలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.11.57 లక్షలతో నిర్మించిన పార్కు కాంపౌండ్ గోడను గురువారం అయిన ప్రారంభించారు. కార్యక్రమములో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ వజీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

ఉండ్రాజవరం: మండలంలో చివటం గ్రామంలో ఎన్‌హెచ్ 16 నుంచి కె.సావరం వరకు సీసీ రోడ్డుకు మంత్రి కందుల దుర్గేష్ గురువారం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు సీపీఎం నివాళి



కొవ్వొత్తులతో మృతులకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నిడదవోలు: అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించిన వారికి సీపీఎం ఆధ్వర్యంలో గురువారం రాత్రి నివాళులర్పించారు. నిడదవోలు పట్టణంలోని గణపతి సెంటర్‌లో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జువ్వల రాంబాబు, గంటి కృష్ణ జి.డానియల్, ఉస్మాన్ మజీద్ సత్యనారాయణ, ప్రభాకర్, సురేష్, నాని తదితరులు పాల్గొన్నారు

బాలుడికి తులాభారం



బాలుడికి పటికబెల్లంతో తులాభారం వేస్తున్న కుటుంబ సభ్యులు

దేవరపల్లి: స్థానిక బాలదుర్గమ్మ తల్లి ఆలయంలో గురువారం బాలుడిని పటికబెల్లంతో తులాభారం వేశారు. మండలంలోని బందపురానికి చెందిన ఎం.సతీష్, వెంకటలక్ష్మి దంపతుల కుమారుడు స్కంద పూర్వజ అయ్యప్పకు కుటుంబ సభ్యులు తులాభారం వేసి మొక్కతీర్చుకున్నారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ, కోశాధికారి కామిశెట్టి దుర్గారావు, భక్తులు పాల్గొన్నారు.

16న మండల పరిషత్ సమావేశం

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో నిడదవోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 16న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జగన్నాథం గురువారం తెలిపారు. ఎంపీపీ తిరుమశ్శ భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా రానున్నారన్నారు. సమావేశంలో అజెండాలోని అంశాలపై చర్చించి మండలాభివృద్ధికి పలు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఇసుక ఫుల్.. విక్రయాలు నిల్..

- గుట్టలుగా పేరుకుపోయినా లబ్ధిదారులకు అవస్థలే
- అనుమతుల కోసం ఎదురుచూపు
- సుదూర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవలసిన దుస్థితి
- భారీగా రవాణా చార్జీలు



కాకరపర్రులో నిల్వ చేసిన ఇసుక



ఉసులుమర్రులో ..

పెరవలి: కావలసినంత ఇసుక ఉన్నా జిల్లా ప్రజలకు భవన నిర్మాణ కష్టాలు తప్పడం లేదు. జిల్లాలో ఈ నెల ఒకటో తేదీ నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు ఇసుక తవ్వకాలు నిలిపివేసినట్టు గనులశాఖ ఆదేశాలు ఇవ్వడంతో ముందుగానే ఇసుకాసురులు ఎక్కడికక్కడ గుట్టలుగుట్టలుగా నిల్వ చేసుకుని విక్రయించకుండా బ్లాక్ చేశారు. దీనితో ఇళ్ల లబ్ధిదారులు, వివిధ నిర్మాణాల కోసం ఇసుక దొరకక నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం బోట్ల ద్వారా వచ్చే ఇసుక కోసం వాడపల్లి, లేకపోతే కోనసీమ జిల్లాల నుంచి తెచ్చుకోవలసిన దుస్థితి ఏర్పడింది. నిడదవోలు నియోజకవర్గంలో పందలపర్రు, కానూరు–పెండ్యాల, తీపర్రు, కాకరపర్రు ఇసుక ర్యాంప్‌లు ఉండగా ఇవన్నీ ఓపెన్ రీచ్‌లు కావటంతో ఇసుక తవ్వకాలు నిలిచి పోయాయి. ఈ ర్యాంప్‌ల వద్ద వర్షాకాలంలో అవసరాల కోసం సుమారు వెయ్యి లారీల ఇసుక నిల్వ చేసినప్పటికీ విక్రయాలకు అనుమతులు రాకపోవడంతో ఉపయోగం లేకుండా పోయింది. విక్రయాలకు అనుమతులు ఇస్తే కేవలం వారం రోజుల్లో ఇసుక గుట్టలు ఖాళీ అయిపోతాయని స్థానికులు చెప్తున్నారు. దీనితో సుదూర ప్రాంతాలకు వెళ్లి ఇసుక కొనుగోలు చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా పడవల్లో వచ్చే ఇసుక ధర ఎక్కువ ఉన్నా, దూర ప్రాంతాల నుండి వెళ్లడం వల్ల కిరాయి ఎక్కువై లబ్ధిదారు కొనుగోలు చేసే పరిస్థితి లేకుండా పోయింది.

ఇసుక నిల్వలు

నిడదవోలు నియోజకవర్గంలో పందలపర్రు, కానూరు, ఉసులుమర్రు, కాకరపర్రు గ్రామాల వద్ద పెద్ద ఎత్తున ఇసుక నిల్వలు ఉన్నప్పటికీ విక్రయాలు లేకుండా పోయాయి. అంతే కాకుండా పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు కూడ ఈ నియోజకవర్గం నుంచే ఇసుకను తరలించేందుకు ఏర్పాట్లు చేశారు.

రాత్రివేళల్లో తరలింపు

ర్యాంప్‌ల వద్ద పగలు ప్రశాంతంగా ఉన్నా రాత్రి సమయాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోందని స్థానికులు చెప్తున్నారు. ఇసుక లారీల శబ్దాలకు నిద్రకూడ పట్టటం లేదని, తెల్లవార్లు తిరుగుతూనే ఉంటున్నాయని అంటున్నారు. అక్రమంగా వేసిన నిల్వలల నుంచి ఈ తోలకాలు జరుగుతున్నాయని చెప్తున్నారు. కొన్ని ర్యాంపుల్లో మాత్రం యథావిధిగా తోలకాలు చేస్తున్నారని, అందుకే ఇసుక కొరత లేకుండా చేస్తున్నారని ఇదంతా దళారులకు లాభాలు తెచ్చిపెడుతున్నాయని అంటున్నారు. గతంలో గోదావరి వచ్చేవరకు ఇసుక తవ్వకాలు జరిపేవారని ఒకవేళ గోదావరి వచ్చినా అప్పటికే నిల్వలు వేసుకోవటం వల్ల ఇళ్ల లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేదని కానీ నేడు గోదావరి రాకుండానే నిల్వలు వేసి తవ్వకాలు నిలిపివేశారని ఆరోపిస్తున్నారు. ఇదంతా దాచుకో–దోచుకో అన్న విదంగా ప్రభుత్వం విదానం ఉందని ప్రజలు అంటున్నారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు



నందమూరులో టీబీ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను అందజేస్తున్న వైద్య సిబ్బంది

తాళ్లపూడి(కొవ్వూరు): క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ ధర్మరాజు తెలిపారు. కొవ్వూరు మండలం దొమ్మేరు పీహెచ్‌సీ పరిధిలో ఇంటెన్సిఫైడ్ టీబీ ప్రచారంలో భాగంగా నందమూరి గ్రామ పంచాయతీ పరిధి 70 మందికి గురువారం క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. గ్రామంలో మందులు వాడుతున్న వారికి దొమ్మేరు పీహెచ్‌సీ హెల్త్ విజిటర్ మృదుల ఆర్థిక సాయంతో పోషకాహార కిట్లను అందజేశారు. క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, రెండు వారాలకు మించి దగ్గు, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, రాత్రిపూట జ్వరం వంటి లక్షణాలు కలిగిన వాళ్లందరూ గ్రామంలో వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. షుగర్ వ్యాధిగ్రస్తులకు, ధూమపానం, మద్యపానం అలవాటున్నవారు ఈ క్షయ వ్యాధి బారిన పడతారన్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు కొవ్వూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఉచితంగా చేసి నిర్ధారణ అయినవారికి ఉచితంగా మందులు ఇస్తారని, ఆరు నెలల చికిత్స కాలంతో పాటు నెలకు రూ.వెయ్యి చొప్పున సాయం అందజేస్తారని డాక్టర్ ధర్మరాజు తెలిపారు. ఎంపీటీసీ కంటిపూడి నవ్యశ్రీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సూచించారు. సూపర్‌వైజర్ ఎ భాగ్యలక్ష్మి, సీనియర్ ల్యాబ్ సూపర్‌వైజర్ ఎస్.భీమరాజు, సమీర్ – ప్రశాంతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత దేవరపల్లి



దేవరపల్లి జట్టుకు కప్ అందజేస్తున్న నిట్టా మోహిత్ నాగ్, శాప్ డైరెక్టర్ రవీంద్రనాథ్

రన్నర్స్‌గా భీమడోలు జట్టు

దేవరపల్లి: స్థానిక అంబటి సత్యనారాయణరావు జెడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తున్న ఉభయ గోదావరి జిల్లాల దేవరపల్లి క్రికెట్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. పంచాయతీ కార్యదర్శి నిట్టా రవికిషోర్ ఆధ్వర్యంలో టోర్నీ నిర్వహించారు. విజేతలకు రవికిషోర్ తనయుడు మోహిత్ నాగ్ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. 56 జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో గురువారం ఫైనల్స్‌లో దేవరపల్లి మోహిత్ లెవెన్స్ జట్టు భీమడోలు నిట్టా లెవెన్స్‌పై ఆరు పరుగుల తేడాతో విజయం సాధించింది. విజేత జట్టుకు నిట్టా మోహిత్ నాగ్, నిట్టా రవికిశోర్, శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ రూ.55,555, ట్రోఫీని అందజేశారు. రన్నర్స్ భీమడోలు జట్టుకు రూ.33,333 నదగు అందజేశారు. తృతీయస్థానంలో నిలిచిన తాళ్లపూడి మండలం పెద్దేవం జట్టుకు క్రికెట్ కిట్టు అందజేశారు. టోర్నీ నిర్వహణకు సహకరించిన గ్రామస్తులకు, క్రీడాకారులకు, వ్యాయామ ఉపాధ్యాయులకు రవికిశోర్ కృతజ్ఞతలు తెలిపారు.

మెట్టలో విస్తారంగా వర్షాలు



దేవరపల్లిలో విస్తారంగా కురుస్తున్న వర్షం

- ఖరీఫ్ సాగుకు అనుకూలం
- చెరువుల కింద ఆకుమడులకు సన్నద్ధం
- ఉష్ణ తాపం నుంచి సేదతీరుతున్న ప్రజలు

దేవరపల్లి: కొవ్వూరు డివిజన్ పరిధి మెట్ట ప్రాంతంలో రెండు రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. గురువారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి వరకు ఎడతెరిపిలేకుండా వర్షం కురిసింది. మొన్నటి వరకు ఎండలతో అల్లాడిన ప్రజలు కాస్త సేదతీరారు. అలాగే ఈ వర్షాలతో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. చెరవుల కింద వరి ఆకుమడులు వేయడానికి రైతులు సన్నాహాలు చేస్తుండగా, బోర్ల కింద ఆకుమడులు వేసి సిద్ధం చేసిన రైతులు నాట్లకు దమ్ములు చేస్తున్నారు. సకాలంలో తొలకరి వర్షాలు కురుస్తున్నందున రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు 143 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. వర్షాలకు గ్రామాల్లోని రహదారులు బురదమయమయ్యాయి.

ఆటపాటలతో విద్య



నిడదవోలు మండలం విజ్జేశ్వరంలో అంగన్‌వాడీ పిలుస్తోంది రా అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

నిడదవోలు రూరల్: చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నామని ఐసీడీఎస్ పెరవలి సీడీపీఓ ఎం.ఆశారోహిణి అన్నారు. మండలంలోని విజ్జేశ్వరంలో 'అంగన్‌వాడీ పిలుస్తోంది రా' కార్యక్రమంలో భాగంగా గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. సర్పంచ్ తిక్కా శ్రీనివాస్, సెక్టర్ సూపర్‌వైజర్ పి.నళిని, అంగన్‌వాడీ కార్యకర్తలు ఏవీకే సత్యవాణి, కేఎస్‌వీ లక్ష్మీకుమారి, డి.అశ్విని, సహాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విద్యార్థుల బడిబాట



తాడిపర్రు ఉన్నత పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహం వద్ద విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఉండ్రాజవరం: వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పాఠశాలలన్నీ విద్యార్థులతో సందడిగా మారాయి. తాడిపర్రు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు తరగతి గదుల గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి పండగ వాతావరణాన్ని తీసుకువచ్చారు. ముందుగా విద్యార్థులు పాఠశాలలో ఉన్న సరస్వతి దేవి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులందరూ విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు.

మలేరియాను అశ్రద్ధ చేయవద్దు



పెరవలిలో మలేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పెరవలి: మలేరియాను అశ్రద్ధ చేయకుండా వెంటనే చికిత్స తీసుకోవాలని తణుకు సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు తెలిపారు. పెరవలిలో గురువారం ప్రజలకు ఆయన మలేరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి మలేరియా రావడానికి ముఖ్య కారణం దోమలని, ఇవి మురుగుగుంటలు, కొబ్బరి బొండాలు, రుబ్బురోళ్లలో నిల్వ ఉన్న నీటిలో ఉత్పత్తి అయ్యి వృద్ధి చెందుతాయన్నారు. వైద్య సిబ్బంది ప్రతి శుక్రవారం డ్రైడేగా నిర్ణయించి పరిసరాలను పరిశీలించాలని తెలిపారు. మలేరియా సోకితే రోజు విడిచి రోజు జ్వరం వస్తుందని చెమటలు ఎక్కువగా పడతాయని, చలి, వణుకు, ఒళ్ళు నొప్పులు వంటివి ఎక్కువగా ఉంటాయని, ఈ లక్షణాలు కనిపించిన వెంటనే ప్రాథమిక వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సత్యనారాయణ, యు.శ్రీనివాసరావు, ఎ.ప్రేమ్ కుమార్, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా జోనల్ క్రీడా పోటీలు



వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

రాజమహేంద్రవరం రూరల్: ఐసీఎస్‌సీఈ జోనల్–ఏ క్రీడా పోటీలు స్థానిక కవలగొయ్యి రోడ్‌లోని ఫ్యూచర్ కిడ్స్ గ్లోబల్ స్కూల్‌లో గురువారం ఉత్సాహంగా జరిగాయి. జోనల్–ఏ స్థాయి క్రీడా పోటీలలో ఆర్చరీ, వాలీబాల్ పోటీల్లో తెలుగు రాష్ట్రాల నుంచి ఆరు పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచినవారు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజనల్ స్థాయిలో జరిగే సీఐఎస్‌సీఈ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల డైరెక్టర్ యేలేటి రవిబాబు తెలిపారు. విజేతలను ఆయనతో పాటు, పాఠశాల చైర్‌పర్సన్ యేలేటి విజయకుమారి, సీఈవో శ్రీమహశ్వి, ప్రిన్సిపాల్ శేషగిరిధర్, డీన్ హర్షిణి తదితరులు అభినందించారు.

పిల్లల స్వేచ్ఛ అందరి బాధ్యత

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి శ్రీలక్ష్మి

కంబాలచెరువు: సమాజంలో పిల్లలందరికీ విద్య, స్వేచ్ఛగా జీవించే పరిస్థితులను కల్పించడం అందరి బాధ్యత అని డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినం సందర్భంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై గురువారం స్థానిక నారాయణపురం సచివాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆరు నుంచి 14 ఏళ్లున్న పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య వారికి రాజ్యాంగ హక్కు అన్నారు. ఈ వయస్సు పిల్లలను కార్మికులుగా మార్చడం చట్టరీత్యా నేరమని, అలా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. పిల్లల భద్రత దృష్ట్యా సంబంధిత అధికారులు, వ్యవస్థలు మరింత పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లల కోసం అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవలను వివరించారు. ఎలాంటి న్యాయ సహాయం కావాలన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా బాల కార్మికులను గుర్తించడానికి కొన్ని బృందాలను ఏర్పాటు చేసి, నగరంలో పలు ప్రాంతాల్లో తనిఖీలు చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీలకు సంబంధించిన నివేదికను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కేఎన్ జ్యోతి, డిస్ట్రిక్ట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బి.శశాంక, అర్బన్ తహసీల్దార్ సీహెచ్‌జీఆర్ పాపారావు, విద్యా శాఖ సెక్షన్ ఆఫీసర్ డి.ఎస్తర్‌రాణి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు లలిత, ఎ.విజయ ప్రకాష్, షేక్ జబీనా, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ లీగల్ ఆఫీసర్ శ్రీగౌరి, పోలీసు అధికార్లు, లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

జగన్‌కు కాపు జేఏసీ కృతజ్ఞతలు

తాళ్లపూడి: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు చినిమిల్లి వెంకట్రాయుడును భీమవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా నియమించిన సందర్భంగా నియోజకవర్గ కాపు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. మండలం కాపు సంఘం అధ్యక్షుడు నామా ప్రకాశం, రాష్ట్ర కాపు జేఏసీ సభ్యుడు తోట రామకృష్ణ, జిల్లా కాపు సంఘం ఉపాధ్యక్షుడు వనిమిరెడ్డి శ్రీనివాస్, కొవ్వూరు మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, కొవ్వూరు మండలం మాజీ అధ్యక్షులు సుంకర సత్యనారాయణ, మాజీ సొసైటీ చైర్మన్ పోసిన శ్రీ కృష్ణ దేవరాయలు, కొమ్మిరెడ్డి పరశురామారావు , శీర్ల బ్రహ్మానందం, బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, ఇంటి వీర్రాజు, గండ్రోతు శివ, నానాజీ, నాగలపాటి శ్రీనివాస్, కొమ్మన మణిబాబు, పప్పప్పుల నాని కృతజ్ఞతలు తెలిపినవారిలో ఉన్నారు.

సాంఘిక సంక్షేమ సహాయాధికారిగా సందీప్



దేవరపల్లి: దేవరపల్లి సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారిగా ఎం.సందీప్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. రాజానగరం సాంఘిక సంక్షేమ శాఖ సహాయ అధికారిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఆర్‌వీ శ్రీనివాస్ ఏలూరుకు బదిలీ అయ్యారు. దేవరపల్లి సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం పరిధిలో దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాలు ఉన్నాయి. మూడు మండలాల పరిధిలో 11 ప్రభుత్వ వసతి గృహాలు ఉన్నాయి.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని దేవరపల్లి సెక్షన్ పరిధిలోని పల్లంట్ల 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని నిడదవోలు ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.నారాయణ అప్పారావు గురువారం తెలిపారు. ఆర్‌డీఎస్‌ఎస్ పనుల్లో భాగంగా 11 కేవీ పల్లంట్ల అగ్రికల్చర్ ఫీడర్ అభివృద్ధి పనుల నిమిత్తం, గ్రామంలో 11 కేవీ స్తంభాల నిర్మాణం జరుగుతున్నాయని ఆయన తెలిపారు. అగ్రికల్చర్ ఫీడర్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు. 11 కేవీ పల్లంట్ల ఫీడర్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ ఉదయం 4 గంటల నుంచి 8 గంటల వరకు ఉండదన్నారు.

రేపు ధుమంతునిగూడెంలో..

దేవరపల్లి సెక్షన్ పరిధిలో 33/11 కేవీ రామన్నపాలెం సబ్‌స్టేషన్‌లో 11 కేవీ రామన్నపాలెం రూరల్ ఫీడర్‌పై ఆర్డీడీఎస్ పనులు జరుగుతున్నందున ధుమంతునిగూడెం, కొత్తగూడెం, సుబ్బరాయపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ తెలిపారు. శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పై గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

కొత్త కాలనీలో గంజాయి బ్యాచ్‌ల హల్‌చల్!

సర్పంచ్‌కు మొర పెట్టుకున్న కాలనీవాసులు



గంజాయి బ్యాచ్‌ల ఆగడాలను వివరిస్తున్న కొత్త కాలనీ వాసులు

కడియం: మండలంలోని జేగురుపాడు పాములమెట్టపైనున్న కొత్తకాలనీలో గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేస్తున్నట్టు స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం సర్పంచ్, వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్‌కు కాలనీవాసులు మొరపెట్టుకున్నారు. పాములమెట్ట ఎస్టీ కాలనీలోని పంచాయతీ మోటారు, ప్రభుత్వ కాలనీలోని మోటారు వైర్లతో సహా, ఆరుగురు రైతులకు చెందిన మోటార్ల వైర్లు కత్తిరించుకుపోయారన్నారు. దీంతో కాలనీలో రెండు రోజులుగా తాగు నీరు అందక ఇబ్బందులు పడ్డామన్నారు. అంతేకాకుండా మోటారు సైకిళ్లు, సైకిళ్లు, ఆఖరికి కోళ్లు, మేకలను కూడా మాయం చేస్తున్నారన్నారు. గుంపులుగా తిరుగుతున్న వారిని ఎవరని ప్రశ్నిస్తే.. అడిగిన వారిపై తిరగబడుతున్నారని స్టాలిన్ దృష్టికి తీసుకువచ్చారు. కాయకష్టం చేసుకుని బతికే వారమని, వారిని ఎదిరించడానికి కాలనీవాసులు భయపడుతున్నారని వారు వివరించారు. గంజాయి బ్యాచ్‌ల ఆగడాలపై పోలీసులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని సర్పంచ్ స్టాలిన్ ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు.